ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 36.0 | కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

3

నారాయణపేట

జిల్లా వార్తలు

బుధవారం 2 జూలై 2025



ప్రభుత్వ అనుమతులతోనే..
ఇసుక తరలింపు

- మాగనూరు పెద్దవాగు ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో
- ఒక మీటరు కన్నా ఎక్కువ లోతు తవ్వితే ఆపాలని స్థానికులకు సూచన

4



రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్
- ఉత్సాహంగా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

5



వనమహోత్సవానికి సమయం ఆసన్నం

- వనపర్తి జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- 255 గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ

5

ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో అసంతృప్తి

- టీఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి

5

ఆదర్శ గురువులు



నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అవ్వారి శ్రీనివాసులు తన కుమారుడు కార్తికేయను గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏడో తరగతిలో చేర్పిస్తున్న దృశ్యం

తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్న గవర్నమెంట్ ఉపాధ్యాయులు

- మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్న పలువురు టీచర్లు
- మెజారిటీ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటుకే పంపుతున్న పరిస్థితి
- వారు బడిబాటలో పాల్గొన్నప్పుడు తల్లిదండ్రుల నుంచి ఎదురు ప్రశ్నలు
- ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరగాలంటే అందరూ పాటించాల్సిందే..

ప్రతీఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రభుత్వం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది.. ఆ పాఠశాల పరిధిలో ఉండే ఊరిలో తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ఉపాధ్యాయుల బాధ్యత. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న విద్యను ఈ బడిబాట కార్యక్రమంలో వివరిస్తున్నారు. బడిబాటకు వెళుతున్న ఉపాధ్యాయులు కొందరికి తల్లిదండ్రుల నుంచి ఎదురుప్రశ్నలు వస్తున్నాయి. తమ పిల్లలను ప్రభుత్వంలో చేర్పిస్తాం సరే కానీ మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారని అడుగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య ఉంటే మీపై మీకే నమ్మకం లేదా అని ప్రశ్నిస్తున్నారు. మీ పిల్లలను ప్రైవేటుకు పంపి మా పిల్లలను ప్రభుత్వంలో ఎలా చేర్పించమంటారు అని అడుగుతున్నారు.. ఈ వింత పరిస్థితిలో కొంతమంది ఉపాధ్యాయులు మొక్కుబడిగా బడిబాటలో పాల్గొంటున్న పరిస్థితి..

నారాయణపేట జిల్లా కృష్ణా మండలం కున్సి గ్రామంలో పనిచేస్తున్న నల్లె శివరాజ్ అదే గ్రామంలో విద్యనభ్యసించి ఉపాధ్యాయుడు అయ్యారు. ఇప్పుడు అదే గ్రామంలో ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రతీఏటా బడిబాట నిర్వహిస్తున్న తాను తన పిల్లలను కూడా ఇందులోనే చేర్పిస్తే గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తానని భావించాడు. ప్రైవేటుకు పిల్లలను పంపించకుండా ఉంటే తన ఉద్యోగం చేసిన తృప్తి కూడా ఉంటుందనే ఉద్దేశంతో 5వ తరగతి చదువుతున్న తన కుమారుడు నల్లె తరుణ్, రెండో తరగతి చదువుతున్న తన కూతురు నల్లె భవ్యశ్రీలకు తాను పనిచేస్తున్న పాఠశాలలోనే అడ్మిషన్ ఇచ్చుకున్నారు..

మహబూబ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్న కొందరు ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే మరికొందరు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలుస్తుండటాన్ని హర్షిస్తున్నారు. ఒక్క నల్లె శివరాజ్ మాత్రమే కాదు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవలి కాలంలో ఈ తరహా ఆలోచనల్లోకి ఉపాధ్యాయులు వచ్చేస్తున్నారు. తమ మీద తమకే నమ్మకం లేకపోతే తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులపై ఉన్న నమ్మకం సన్నగిల్లుతుందనే ఉద్దేశంతో వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలవైపు మళ్లిస్తున్నారు. వారిని చూసి మరింత మంది ఈ తరహా ప్రయత్నం చేస్తే ప్రభుత్వంలో మెరుగైన బోధన లభించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రైవేటుతో పోటీపడే అవకాశం కూడా ఉంటుంది. ఇప్పటికే ప్రైవేటులో ఫీజులు చెల్లించాలంటే తల్లిదండ్రులు హడలిపోతున్న క్రమంలో ప్రభుత్వంవైపు మళ్లే అవకాశాలు కూడా మెండుగా ఉంటాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది కొంత ప్రభుత్వ పాఠశాలలవైపు మొగ్గుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది మరింతగా పెరగాలంటే ప్రభుత్వ ఉపాధ్యాయులే తమపై నమ్మకం పెంచుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..

- నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న అవ్వారి శ్రీనివాసులు తన కుమారుడు కార్తికేయను మార్చాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతిలో చేర్పించాడు. నేటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన

(మిగతా 4లో..)

బిల్లులు వస్తున్నాయా?

- లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్ విజయేందిర బోయి
- చిన్నాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మహమ్మదాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు దశలవారీగా వస్తున్నాయా?.. ఇప్పటి వరకు ఎన్ని డబ్బులు వచ్చాయి?' అని కలెక్టర్ విజయేందిర బోయి లబ్ధిదారులను ప్రశ్నించారు. అందుకు వారు స్పందిస్తూ ఇప్పటి వరకు రూ.4 లక్షలు వచ్చాయని తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.లక్ష వస్తుందని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ మంగళవారం మహమ్మదాబాద్ మండలం చిన్నాయపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. గ్రామానికి 140 ఇళ్లు మంజూరు కాగా, 98 ఇళ్లకు ముగ్గు పోశామని అధికారులు తెలిపారు. 43 బేస్‌మెంట్ వరకు, 20 గోడల వరకు, 8 స్లాబ్ వరకు పూర్తి చేసినట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని, అందుకు అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్ని చదరపు అడుగులలో ఇల్లు నిర్మించారని లబ్ధిదారు లక్ష్మిని కలెక్టర్ అడుగగా, 400 చదరపు అడుగులలో నిర్మించినట్లు ఆమె చెప్పారు. ఇప్పటి వరకు ఇంటికి ఎంత ఖర్చయ్యిందని పలువురు లబ్ధిదారులను అడుగగా, రూ.8 లక్షలు అయ్యిందని వారు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన డిజైన్ ప్రకారమే నిర్మాణం చేపట్టాలన్నారు. ఎక్కువ ఖర్చు చేసి అప్పుల పాలు కావొద్దని లబ్ధిదారులకు సూచించారు. ఇసుక త్వరగా సరఫరా అయ్యేలా చూడాలని, ట్రాక్టర్ కిరాయి, లేబర్ చార్జి తగ్గించాలని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందుకు ఆమె స్పందిస్తూ- లబ్ధిదారులకు కావలసిన ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్, తహసీల్దార్ విద్యా సాగర్‌రెడ్డి , ఎంపీడీవో నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

తహసీల్‌ను మార్చాలి

ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం సర్వీస్ రోడ్డుకు దగ్గరగా ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని, ఇక్కడి నుంచి అటవీ శాఖ కార్యలయంలోకి మార్చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులతో మాట్లాడతానన్నారు. తహసీల్‌ను తనిఖీ చేసి, అక్కడి వచ్చిన ప్రజలతో సమస్యలపై మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి చెప్పారు.

రూ.2.17 లక్షలు దుర్వినియోగం

- ఉపాధి హామీలో మిడ్జిల్ మండలంలో జరిగినట్లు గుర్తింపు
- అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పలు గ్రామాల కూలీలు
- రికవరీకి ఆదేశించిన డీఆర్డీవో



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో

మిడ్జిల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మండలంలో జరిగిన అవకతవకలకు సంబంధించి రూ.2.17 లక్షలు రికవరీకి అధికారులు ఆదేశించారు. పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమీక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. అదనపు డీఆర్‌డీవో ముషాయిదాబేగం, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రేమలత సమక్షంలో సమీక్ష చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో పథకం కింద చేపట్టిన పనుల వివరాలను, గ్రామాలలో చేపట్టిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అన్ని గ్రామాల్లో కలిపి మొత్తం రూ.2 లక్షలా 17వేలు రికవరీ చేయాలని సంబంధిత అధికారులను ముషాయిదాబేగం ఆదేశించారు. పలు ఉపాధి హామీ కూలీలు, నాయకులు అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక మొత్తంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, ఏపీవో రాజేష్‌కుమార్, టీఏలు, సామాజిక తనిఖీ బృందాలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌లతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్
- వరదలు, భూభారతి, కొత్త రేషన్ కార్డుల జారీపై సమీక్ష

నారాయణపేట టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వానాకాలం నేపథ్యంలో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీసీ హాల్‌లో మంగళవారం ఆమె అన్ని మండలాల తహసీల్దార్లతో వరదలు, భూ భారతి పెండింగ్ దరఖాస్తులు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ, కొత్త రేషన్ కార్డుల జారీపై సమీక్ష చేశారు. వరదల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కృష్ణానది తీర ప్రాంతాల్లో ముందస్తు చేపట్టాల్సిన చర్యల గురించి మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల తహసీల్దార్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఎంత వరకు వచ్చిందని, ఇంకా ఎన్ని ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని అడిగారు. అధికారులు సమన్వయంతో పని చేసి, భూసేకరణను పూర్తి చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులందరికీ కా ర్డులు వచ్చేలా చూడాలన్నారు. సమీక్షలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసాపై.. ఆశలు



విత్తనాలు విత్తుతున్న కూలీలు(ఫైల్)

ఎదురు చూస్తున్న భూమిలేని వ్యవసాయ కూలీలు

- నారాయణపేట జిల్లాలో 6,970 దరఖాస్తులు
- క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వనున్న ఎంపీడీవోలు

నారాయణపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా డబ్బులు అందించిన ప్రభుత్వం ఇప్పుడు భూమిలేని వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అందించేందుకు సిద్ధమైంది. ఒక్కో లబ్ధిదారుడికి ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం వాటిని రెండు విడతలుగా రూ.6 వేల చొప్పున ఇవ్వనుంది. జిల్లా వ్యాప్తంగా 1,10,809 జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో యాక్టివ్ జాబ్ కార్డులు 71,309 ఉండగా, 8,189 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు.

దరఖాస్తులు ఇలా..

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 8,189 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఏడాదిలో 20 రోజులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసిన వారికి పథకాన్ని వర్తింపచేయనున్నారు. నిబంధనల ప్రకారం 3,847 మందిని పథకం కింద అర్హులుగా ఎంపిక చేశారు. ఈ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల్లో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆ మేరకు ప్రయోజనం కూడా ఎక్కువ మందికి చేకూరనుంది. 6,970 మంది దరఖాస్తు చేసుకోగా.. ఎంపీడీవో కార్యాలయంలో వాటిని పరిశీలించి, నివేదికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. దరఖాస్తులను ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆధార్ అనుసంధానంతో పాటు రెవెన్యూ అధికారుల దగ్గర క్రాస్ చెక్ చేయనున్నారు. కుటుంబంలో ఒక్కరే ఉన్నారా? లేక ఇద్దరు ఉన్నారా? అనేది క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నారు.

వానాకాలం రైతు భరోసా రూ.260.57 కోట్లు జమ

జిల్లాలో 1,85,300 మంది రైతులకుగాను 1,79,156 మంది రైతుల ఖాతాల్లో 260.57 కోట్లు వానాకాలం రైతు భరోసాను ప్రభుత్వం జమ చేసింది. ఖాతాలు రద్దు చేసుకోవడంతో 532 మంది రైతులకు ఖాతాల్లో రూ.91 లక్షలు డబ్బులు జమ కాలేదు. పంటలు సాగు చేయని రైతులకు ప్రభుత్వం భరోసా అందించలేదు. మెజారిటీ రైతులకు రైతు భరోసా డబ్బులు అందడంతో సాగు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

- డీఈవో స్పందించాలి
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో విద్యాశాఖలో చర్చ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై 'విద్యాశాఖలో వసూళ్లు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. అనుమతుల కోసం విద్యాశాఖలో దరఖాస్తు చేసుకున్న పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అక్రమాలపై చర్చించుకున్నారు. కొందరు సిబ్బంది చేయి తడపనిదే పని చేయడం లేదని మాట్లాడుకున్నారు. పలువురు బాధితులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి నిజాన్ని నిర్భయంగా రాశారని, తమను డబ్బుల కోసం వేధించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించి కోర్టు నుంచి వచ్చిన ఆదేశాలను పాటించడం లేదని మండిపడ్డారు. విద్యాశాఖ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారించి, వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వర్షం లేక మూడు ఎకరాల్లో సాగు చేసిన పత్తి మొలకలు ఎండుతున్నాయని పొలంలో దీనంగా కూర్చున్న మరికల్ మండలం కన్మనూరుకు రైతు వెంకటయ్య

జాడ లేని వాన

- జూన్ నెల పూర్తయినా కురవని వర్షాలు
- వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు

4

ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదంటూ..
ఒంటిపై పెట్రోల్ పోసుకునే యత్నం

- జడ్చర్ల పోలీస్ స్టేషన్ వద్ద ఘటన
- అడ్డుకున్న పోలీసులు

జడ్చర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు ఓ మహిళ యత్నించగా పోలీసులు అడ్డుకున్న సంఘటన మంగళవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. విశ్వసనీయం సమాచారం ప్రకారం.. జడ్చర్ల హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ మహిళ, అదే కాలనీలో ఉండే ఓ వ్యక్తికి అప్పు ఇచ్చింది. అసలు, మిత్తి కలిపి రూ.18 లక్షలు అయ్యాయి. అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఆమె సదరు వ్యక్తిని కోరింది. ఈ అంశంపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇరువర్గాలు మాట్లాడుకుంటుండగా కోపోద్రిక్తురాలైన సదరు మహిళ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునేందుకు యత్నించింది. గమనించిన పోలీసులు అడ్డుకుని, ఇరువర్గాలకు సర్దిచెప్పారు. సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని, పోలీస్ స్టేషన్ వద్ద ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దంటూ సూచించారు. దీంతో ఇరువర్గాలు వారు పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లిపోయారు.

మగ్గం ఉన్నవారికే కొత్త జియోట్యాగ్‌లు

- జియోట్యాగ్ దరఖాస్తుదారుల మగ్గాలు పరిశీలన
- జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ గోవిందయ్య



రాజోలిలో చేనేత కార్మికుల మగ్గాలను పరిశీలిస్తున్న ఏడీ గోవిందయ్య, ఆర్‌డీడీ పద్మ

రాజోలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మగ్గం ఉన్నవారికే కొత్త జియోట్యాగ్ నెంబరు అందుతుందని జోగుళాంబ గద్వాల జిల్లా చేనేత, జౌళీశాఖ ఏడీ గోవిందయ్య అన్నారు. రాజోలిలో కొత్తగా చేనేత మగ్గం ఏర్పాటు చేసుకుని చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తూ, కొత్త జియోట్యాగ్ నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల మగ్గాలను మంగళవారం ఆయన ప్రాంతీయ ఉప సంచాలకు (ఆర్‌డీడీ) పద్మ, ఏడీవో ఉపేంద్రతో కలిసి దరఖాస్తుదారుల ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ గోవిందయ్య మాట్లాడుతూ రాజోలిలో 141మంది, అయిజలో 40మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారి మగ్గాల పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీడీ పద్మ, ఏడీవో ఉపేంద్ర, క్లస్టర్ సీడీలు శివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.

జాడ లేని వాన



వర్షాలు కురిసినప్పుడు పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు(ఫైల్)

- జూన్ నెల పూర్తయినా కురువని వర్షాలు
- వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపులు

మరికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలు జూన్ మొదటి వారంలోనే ప్రారంభమయ్యాయి. తొలకరి జల్లులతో రైతులు ఏరువాక పనులు మొదలు పెట్టి విత్తనాలు విత్తుకున్నారు. జూన్ నెల మొదటివారం లోనే నైరుతీ రుతుపవనాలు, రెండోవారం నుంచి తొలకరి వర్షాలు కురిశాయి. జూలై నెల వచ్చినా ఇప్పటివరకు వాన జాడ కానరావడం లేదు. జోరుగా వర్షాలు కురువాల్సిన సమయంలో వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మే చివరి వారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని విత్తనాలు నాటారు. భారీ వర్షం కురిసిన తర్వాత విత్తనాలు విత్తాల్సిన రైతులు ముందుగానే విత్తనాలు వేశారు. గతంలో ఈ సమయానికి పత్తిసాగు సగం వరకు పూర్తయి కలుపు తీసే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ సంవత్సరం వర్షాలు లేకున్నా చాలాచోట్ల ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తుకుని వరుణుడిపై భారం వేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర రూ.7,020 పెంచడంతో ఈసారి అధికంగా పత్తిసాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో విత్తనాలకు డిమాండ్ పెరిగింది. కొంత మంది రైతులు విత్తనాలు వేసుకున్నారు. మరికొందరు విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. సకాలంలో వర్షాలు రాకపోతే మరోసారి విత్తనాలు విత్తడం తప్పదు. అకాలవర్షాల నుంచి పంటలను రక్షించేందుకు గతేడాది నుంచి ప్రభుత్వం ముందుస్తు సాగు విధానం ప్రవేశపెట్టినప్పటికి మండలంలో ముందుస్తు సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు.

ఎనిమిది ఏళ్ల తర్వాత తెరుచుకున్న బడి

మండల విద్యాధికారి భాస్కర్‌శర్మ



వార్లగుడిసెలో పాఠశాల ప్రారంభించిన మండల విద్యాధికారి భాస్కర్‌శర్మ

కోడేరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వార్ల గుడిసెలలో ఎనిమిదేళ్ల క్రితం మూతపడిన పాఠశాలను తిరిగి మంగళవారం మండల విద్యాశాఖాధికారి భాస్కర్‌శర్మ ప్రారంబించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశానుసారం పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. వార్ల గుడిసెలలో ముగ్గురు పిల్లలతో పాఠశాలను ప్రారంభించామని, పసుపుల పాఠశాలకు యూపీఎస్ పసుపుల నుంచి ఎస్టీటి టీచర్ నరేష్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడ పని చేస్తారని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడేరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, పసుపుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, సీఆర్పీ విజయలక్ష్మి, జనుంపల్లి హెచ్ఎం సుధాకర్, ఎంఈవో ఆఫీస్ ఆపరేటర్ పి. నాగేంద్రం పాల్గొన్నారు.

కృష్ణానది తీరంలోకి ఎవరూ వెళ్లవద్దు



మంచాలకట్ట సమీపంలో కృష్ణానది తీరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు

పెంట్లవెల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది తీరంలోకి పర్యాటకులు, అదే విధంగా స్థానికులు ఎవరు కూడా వెళ్లవద్దని పెంట్లవెల్లి ఎస్ఐ రామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో కృష్ణానది తీరాన నదిలోకి ఎవరూ వెళ్లవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణానదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మత్స్యకారులు కూడా చేపల వేటకు వెళ్లవద్దని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా పర్యాటకులు స్నానాలు చేసేందుకు ఈత కొట్టేందుకు వెళ్లవద్దని తెలిపారు. అదే విధంగా నది దగ్గర కూర్చొని మద్యం సేవించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు పాల్గొన్నారు.

అధ్వాన ప్రాంగణాలు..

- జిల్లాలో అలంకారప్రాయంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు
- ఆటలాడేందుకు అనువుగా లేని స్థలాలు
- ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 280 ఏర్పాటు



గట్టులో మౌలిక వసతులు కల్పించక నిరుపయోగంగా ఉన్న క్రీడాప్రాంగణం

గట్టు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఊరూరా తెలంగాణ క్రీడాప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. ఎలాంటి సౌకర్యాలు లేకుండా, కేవలం బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. స్థలాలు కూడా ఆటలు ఆడేందుకు అనువుగా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 280 వరకు ఏర్పాటు చేసిన ఈ క్రీడా ప్రాంగణాల్లో గత ప్రభుత్వ హయాంలో విటిని అభివృద్ధిపరచడానికి కొంత శ్రద్ధ కనబరిచారు. కానీ ప్రస్తుతం గాలికివదలి వేయడంతో చెత్తాచెదారంతో నిండి, పిచ్చిమొక్కలు పెరిగి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

ప్రభుత్వ స్థలాల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లోని గ్రామాల్లో మొత్తం 296 ప్రాంగణాలు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా ఇందులో 280 ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. మిగితా 16 ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలు చూయించలేకపోయారు. ప్రస్తుతం జిల్లాలో 280 ప్రాంగణాలను పూర్తి చేసినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒక్కో ప్రాంగణంలో చదును చేయడంతో పాటు క్రీడలు ఆడటానికి కావాల్సిన పరికరాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. అనేక ప్రాంగణాలలో నామమాత్రంగా పనులు చేసి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి.

బోర్డులకే పరిమితం

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా మైదానాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఊరికి దూరంగా ఆటలకు అనుకూలంగా లేని స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. ఈ క్రీడా ప్రాంగణాలవైపు క్రీడలు ఆడటానికి గ్రామాలలోని యువకులు ఇష్టపడటంలేదు. పండుగలు, ప్రత్యేక రోజుల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నప్పటికీ అసౌకర్యంగా ఉండడం వల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను వినియోగించుకోవడం లేదు. రూ.లక్షలు వ్యయం చేసినప్పటికీ మైదానాలను ఉపయోగంలోకి తేకపోవడంపై గ్రామీణ క్రీడాకారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను క్రీడల్లో ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి



గ్రామాల్లోని తెలంగాణ క్రీడా ప్రాంగణాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, వినియోగంలోకి తేవాలి. దీనికోసం పర్యవేక్షణ కూడా చేయాలి. రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ మైదానాలు అందుబాటులోకి వస్తే గ్రామీణ క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

- కమ్మరి, రమేశ్, యువకుడు గట్టు

మండలాల వారీగా క్రీడా ప్రాంగణాలు			
మండలం	మంజూరు	పూర్తయినవి	మిగిలినవి
అయిజ	30	30	0
అలంపూర్	14	14	0
ధరూర్	37	34	3
గద్వాల	32	30	2
గట్టు	33	32	1
ఇటిక్యాల	32	31	1
కే.టీ.దొడ్డి	31	28	3
మల్దకల్	31	26	5
మానవపాడు	16	16	0
రాజోలి	13	13	0
ఉండవల్లి	16	16	0
వడ్డేపల్లి	11	10	1
మొత్తం	296	280	16

ఉపయోగంలోకి తెస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న క్రీడామైదానాలను ఉపయోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. క్రీడా మైదానాల నిర్వహణ ఆయా గ్రామ పంచాయతీలకు ఉంటుంది. ఎక్కడెక్కడ నిరుపయోగంగా ఉన్నాయో వాటిపై సమీక్ష నిర్వహిస్తాము. వాటి నిర్వహణతో పాటు అభివృద్ధికి ప్రత్యేకంగా నిదులు లేవు. ఆయా గ్రామ పంచాయతీలలో పరిశీలించి కార్యదర్శులకు సూచనలు ఇస్తాము.

- నర్సింగరావు, అదనపు కలెక్టర్

రైతుల సమస్యలు పరిష్కరించాలి

- విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రైతులతో కలిసి బీజేపీ నాయకుల ధర్నా



పెద్దకొత్తపల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దకొత్తపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తమ వ్యవసాయ బోరు బావులకు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీలు కట్టి ఏళ్ల గడుస్తున్నా అధికారులు ఇవ్వడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రైతులతో కలిసి గంట సేపు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతులు ట్రాన్స్‌ఫార్మర్స్ కోసం డీడీలు కట్టి ఏళ్ల గడుస్తున్నా విద్యుత్ అధికారులు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ ఏఈ ప్రదీప్ స్పందిస్తూ డీడీలు కట్టిన రైతులకు సీనియార్టీ ప్రకారం వెం టనే ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పదిర భీమేష్, తిరుమల్ యాదవ్, పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మేకల శివ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రాజు, పూజారి చంద్రశేఖర్, వినోద్, లింగస్వామి, మేకల శివ, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతులతోనే ఇసుక తరలింపు

- ఆర్డీవో రాంచందర్



మాగనూరులో స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాంచందర్

మాగనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులతో రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇసుక తరలింపు జరుగుతుందని నారాయణపేట ఆర్డీవో రాంచందర్‌నాయక్ అన్నారు. మంగళవారం పేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలోని 167వ జాతీయ రహదారి బ్రిడ్జి సమీపంలోని పెద్దవాగు ఇసుక రీచ్‌ను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ ఎత్తిపోతల పథకానికి పైపులైన్ కోసం పైపులు తయారు చేసే రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మాగనూరు పెద్దవాగు నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇసుకను తరలిస్తే తాగునీరు, సాగునీటికి కష్టాలు ఏర్పడుతాయని తెలిపారు. స్పందించిన ఆర్డీవో వాగులో మైనింగ్ అధికారుల సూచనలతో ఒక మీటరు లోతులోనే ఇసుక తీసుకెళ్తారన్నారు. ఎవరికైనా అనుమానం వస్తే ఇసుక తరలించే సమయంలో ఒక్క మీటరు కన్నా ఎక్కువ లోతు ఇసుకను తీసుకువెళ్తుంటే ఆపాలని స్థానికులకు సూచించారు.

అధికారుల పర్యవేక్షణలోనే ఇసుక తరలింపు ఉంటుందన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ సురేష్‌కుమార్, సీఐ రాం లాల్, ఎస్ఐ అశోక్‌బాబు, ఆర్ఐ శ్రీశైలం, మైనింగ్ ఆర్ఐ ప్రతాప్, వివిధ పార్టీల నాయకులు, రైతులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్



రైతులకు స్ప్రింకర్ల అందజేస్తున్న అధికారి వేణుగోపాల్

మహమ్మదాబాద్ జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని, ఇందుకోసం రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నంచర్ల రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సబ్సిడీ అందజేస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఇస్తోందన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మొక్కలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు స్ప్రింకర్లకు సంబంధించి 75శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ మాట్లాడుతూ రైతులకు గత ప్రభుత్వం సబ్సిడీ కింద రైతులకు ఇచ్చే బిందు, తుంపర్ల నిలిపివేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అయిన తర్వాత రైతులకు వ్యవసాయానికి అన్ని రకాల పరికరాలు సబ్సిడీ కింద ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం 19 మంది రైతులకు స్ప్రింక్లర్లు అందజేశారు. ఉద్యావనశాఖ అధికారి స్వప్న, ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్ శేఖర్, ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

7న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : గద్వాల ఉత్తనూరులో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించ నున్న అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపి యన్ షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 7న బాలనగర్ మండల కేంద్రంలోని ఈఎంఆర్ఎస్-ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు మక్సూద్ బిన్ జాకేర్, నస్రూల్లా హైదర్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2007 తరువాత పుట్టిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకా రులు జనన ధ్రువపత్రం, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ తీ సుకొని ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

ఆదర్శ గురువులు

(5వ పేజీ తరువాయి)

విద్య అందుతోందని అందరికీ తెలిసేందుకు, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలుపుతున్నారు. అదే గ్రామంలో శ్రీనివాస్ కూడా పనిచేస్తుండటంతో రాకపోకలకు సంబంధించి కూడా ఇబ్బందులు లేవు.

మరి కొంతమంది కూడా...

మల్దకల్ మండలం చిప్పదొడ్డిలో పనిచేస్తున్న మల్లేష్ తన కుమారులను ఎల్కూరు జడ్పీహెచ్ఎస్‌లో చదివిస్తున్నారు.. పెద్ద కుమారుడు సాత్విక్ నాలుగో తరగతి చదువుతుండగా చిన్న కుమారుడు దీక్షిత్ మూడో తరగతి చదువుతున్నాడు. అలాగే మదనాపూర్ మండలం దుప్పల్లిలో పనిచేస్తున్న రమేష్ అనే ఉపాధ్యాయుడు తన కూతురు అక్షయను కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో మూడేళ్లుగా చదివిస్తున్నారు. ప్రస్తుతం అక్షయ పదో తరగతి చదువుతోంది. భూత్పూరు మండలం కర్వెన జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ తన కుమారుడు కార్తీక్‌ను అక్కడే ఎనిమిదో తరగతి చదివిస్తున్నాడు. కోస్గి ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అఖిల కానం తన పెద్ద కూతురు నబిహా అంబర్‌ను ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉర్దూ మీడియం పాఠశాలలో చదివించగా రెండో కూతురు ఫరీహా అంబర్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. మూడో కూతురు సుహేరా అంబర్ ఎంపీపీఎస్ ఉర్దూ మీడియంలో నాలుగో తరగతి చదివిస్తున్నారు. జడ్చర్ల మండలం తంగేళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఆనంద్‌కుమార్ అనే ఉపాధ్యాయుడు తన కూతురు శ్రీ వేదను రెండో తరగతిలో అదే పాఠశాలలో చేర్పించారు. రోజూ తనే తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. వెల్దండ మండలం కొట్ర ప్రాథమిక పాఠశాలలో సీఆర్‌పీ పనిచేసే ఆంజనేయులు తన పిల్లలను అదే పాఠశాలలో చేర్పించారు. అమ్రాబాద్ మండలం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఎలయ్య అనే ఉపాధ్యాయుడు తన కూతురు ఇన్నను తను పనిచేస్తున్న పాఠశాలలోనే నాలుగో తరగతిలో చేర్పించారు. మహ్మదాబాద్ మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే దస్తయ్య అనే ఉపాధ్యాయుడు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నాడు.


గౌతం మౌర్య నాలుగో తరగతి, సిద్ధార్థ మౌర్య రెండో తరగతి చదువుతున్నారు. వంగూరు మండలం తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోటేశ్వరరావు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే ఒకరిని ఆరో తరగతి, మరొకరిని ఏడోవ తరగతి చదివిస్తున్నారు.

● నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం పులిమామిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ టీచర్‌గా పనిచేస్తున్న మహేష్‌కుమార్ తన ఇద్దరు కుమార్తెలను అదే జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాయిన్ చేశారు. నిత్య శ్రీ ఏడో తరగతి చదువుతుండగా నవ్యశ్రీ ఆరో తరగతి చదువుతోంది. మరికల్ గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ ఇటీవల బదిలీపై పులిమామిడి పాఠశాలకు రాగా తను పనిచేసే పాఠశాలలోనే కూతుళ్లను చేర్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేవని, తానే దగ్గరుండి పిల్లలను చూసుకుంటుండటం సంతోషంగా ఉన్నదని అంటారు మహేష్‌కుమార్..





● నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని మొగల్‌మడ్క ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎన్ అరుణ తాను పనిచేస్తున్న పాఠశాలలోనే తన కుమారుడు శ్రీహన్‌రెడ్డిని ఒకటో తరగతిలోనే జాయిన్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం, అధిక శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, మెరుగైన విద్య అందడానికి అవకాశం ఉంటుందని, ప్రైవేటు పాఠశాలలకు పంపి శిక్షణ లేని వారితో విద్య నేర్పించడం కంటే తన కళ్ల ఎదుటే పిల్లాడు చదువుతుంటే అంతకంటే సంతోషం ఏమీ ఉండదని ఉపాధ్యాయురాలు అరుణ అంటున్నారు.



● వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని బున్యాదిపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నాగేషు తను విద్యాబోధన చేసే పాఠశాలలోనే తన కుమారుడు శశాంక్‌ను చేర్పించాడు. ఒకటో తరగతి నుంచీ అదే పాఠశాలలో చదివిస్తుండగా ప్రస్తుతం శశాంక్ మూడో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతోందని, ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు పునాదుల లాంటివని అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలంటే ప్రతీ ఉపాధ్యాయుడు అక్కడే చదివించాలంటున్నారు నాగేషు..

● నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెనిమిల్ల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కేశవరావు తన కొడుకు వేదవ్యాస మహర్షిని గత ఏడాది తాను విద్యాబోధన చేస్తున్న పాఠశాలలోనే నాలుగో తరగతిలో చేర్చుకొని గ్రామస్థులు, సహచర ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. తమపై తమకు నమ్మకం లేక విద్యార్హతలు సరిగా లేని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించని వారితో పిల్లలకు విద్యాబోధన చేయిస్తే అంతకంటే దారుణం ఉండదని భావించి ముందుగా తాను మారాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేశవరావు అంటున్నారు.



క్రైం కార్నర్

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

» హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహాన్ని తిప్పి పంపిన పోలీసులు



హనుమంతు (ఫైల్)

ఖిల్లాఘణపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతులకుంట తండాకి చెందిన కేతావత్ హనుమంతు(38) హైదరాబాద్ గచ్చిబౌలి సమీపంలోని గోపన్‌పల్లి చెరువు వద్ద మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు హనుమంతు హైదరాబాద్ గోపన్‌పల్లి శివారు ప్రాంతంలో కత్తితో గొంతు కింది భాగంలో కోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామం కోతులకుంట తండాకు మంగళవారం సాయంత్రం తీసుకొచ్చారు. అప్పుల బాధతోనే మృతుడు హనుమంతు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి కత్తి గాట్లు ఉన్న ఫొటోలు వాట్సాప్‌లో హైదరాబాద్, స్వగ్రామంలో వైరల్‌గా మారాయి. పోలీసులకు అందిన సమాచారం మేరకు.. మృతుడికి కత్తిగాట్లు ఉండడంతో హైదరాబాద్‌లో సంఘటన జరిగినందున మృతదేహాన్ని తిప్పి పంపినట్లు కొత్తకోట సీఐ రాంబాబు తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారని సీఐ తెలిపారు. మృతుడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య జమునమ్మ, కుమారులు రవి, సంతోష్ ఉన్నారు. కోతులకుంట తండాలో కొత్తకోట సీఐ రాంబాబు పర్యవేక్షణలో ఇన్‌చార్జి ఎస్ఐ జయన్న ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన ఐదుగురికి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శృతి దూత జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలో ఐదుగురు పట్టుబడ్డారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములకు చెందిన కూర మధుకు 7రోజులు జైలు శిక్ష అదే మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన ఎది రేపల్లి రాములుకు రెండు రోజుల జైలు శిక్ష, రేవల్లి మండలం గట్టురాయి పాకులకు చెందిన దోతి గిరిబాబుకు రెండు రోజుల జైలు శిక్ష, నాగర్‌కర్నూల్‌కు చెందిన ముమ్మిడి శ్రీనివాస్‌చారి ఒక రోజు జైలు శిక్ష, నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లికి చెందిన చిక్కొండ్ర వెంకటయ్యకు ఒక రోజు జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ పేర్కొన్నారు. మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపి పట్టుబడితే కఠినంగా శిక్షలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

మహిళ అనుమానాస్పద మృతి

అయిజ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని మాలపేటకు సమీపంలో ఉంటున్న సరోజ (ఈరమ్మ) (42) అనుమానాస్పదంగా మృతి చెందింది. ఎస్సై శ్రీనివాస రావు కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోని మంచంపై సరోజ పడి ఉండటాన్ని గ్రహించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహిళ మృతి చెందిందని డాక్టర్లు చెప్పటంతో ఇంటికి తీసుకెళ్లారు. సమాచారం అందడంతో ఎస్ఐ మృతురాలి ఇంటికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సరోజకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోస్టాఫీసు ఖాతాలో డబ్బు ఖాళీ

మానవపాడు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి అనే రైతుకు మానవపాడు పోస్టాఫీస్‌లో ఖాతా ఉంది. ఈ ఖాతాలో పీఎం కిసాన్ పథకం, వంటగ్యాస్ సబ్సిడీ డబ్బులు జమ అవుతుండేవి. పీఎం కిసాన్ ద్వారా ఇప్పటికి 19సార్లు నగదు జమ కాగా రైతు శ్రీకాంత్‌రెడ్డి ఆరుసార్లు డ్రా చేసుకున్నాడు మిగిలిన డబ్బు ఖాతా నుంచి ఎవరు తీశారనే విషయంపై నివేదిక ఇవ్వాలని పోస్టుమాస్టర్ మంగళవారం రామనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో అదే కార్యాలయంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తీసుకున్నట్లు తెలిసిందని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పోస్టుమాస్టర్ చెప్పారు.

లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలి

» బజరంగ్ దళ్ అచ్చంపేట ప్రముఖ్ శివ చంద్ర



డీఎఫ్‌వోకు వినతి పత్రం అందజేసిన బజరంగ్‌దళ్ సభ్యులు

అచ్చంపేటటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఏకాదశి పర్వదినాన లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలని బజరంగ్‌దళ్ అచ్చంపేట ప్రముఖ్ శివ చంద్ర అన్నారు. మంగళవారం పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 6వ తేదీన తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా లొద్ది మల్లయ్య దేవస్థానాన్ని భక్తులు దర్శించుకునేందు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వాలని కోరారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి మాట్లాడుతూ అభయారణ్యంలో ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అభయారణ్యంలో వెలిసిన మల్లయ్యను దర్శించుకు నేందుకు ఒక్కరోజు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అటవీప్రాంతంలో చెట్లను కొట్టకుండా జంతువులకు హాని కలిగించకుండా దర్శనం చేసుకోవాలని సూచించారు. అభయారణ్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందులాల్ చౌహాన్, శివాజీ, నరేష్, తిరుపతి, అజయ్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీల వితరణ



డ్యూయల్ డెస్క్, బెంచీలు అందించిన బాలస్వామి, పక్కన హెచ్ఎం

తెలకపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గౌతంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన ఐపీఎస్ బాలస్వామి, అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మిద్దె పరశురాములు లక్ష రూపాయల విలువ చేసే 25 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించారని హెచ్ఎం ఎం. రమేష్ మంగళవారం తెలిపారు. గతంలో కూడా ఐపీఎస్ బాలస్వామి రూ. 8 లక్షలతో పాఠశాల పునరుద్ధరణకు సహకరించారని పేర్కొన్నారు. గ్రామంలో బాలస్వామి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వనమహోత్సవానికి సమయం ఆసన్నం

» వనపర్తి జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

» 255 గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణ

» మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు



పెద్దగూడెం గ్రామంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

వనపర్తి రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పచ్చదనాన్ని పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం వన మహోత్సవానికి శ్రీకారం చుట్టింది. గత బీఆర్ఎస్ హయాంలో హరితహారం పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందుకోసం వనపర్తి జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలో అధికారులు నర్సరీలను ఏర్పాటు చేసే మొక్కలను పెంచుతున్నారు. వర్షాల ఆధారంగా ఈ నెల మొదటి వారం లేదా రెండవ వారంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలాలు, చెరువుల గట్లపైన, ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ కేంద్రాలు, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులు కొనసాగుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 58 లక్షల మొక్కలు

వనపర్తి జిల్లాలోని 14 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతీ నర్సరీలో దాదాపు 10 వేల మొక్కలను పెంచుతున్నారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, పోలీస్, నీటి పారుదల, విద్య, వైద్య, విద్యుత్, పశు సంవర్ధక, ట్రైబల్ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈనెలలో జిల్లా వ్యాప్తంగా 50 లక్షల మొక్కలను నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వించాలని సంబంధిత శాఖల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పూలు, పండ్ల మొక్కలతో పాటు రోడ్లకు ఇరువైపులా నీడ నిచ్చే మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందించింది. అలాగే గ్రామ పంచాయతీల్లో ప్రతీ ఇంటికి 6 మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. నర్సరీల్లో గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, తులసి, దానిమ్మ, బొప్పాయి, ఈత, వేప మొక్కలతో పాటు ఇతర ఔషధ మొక్కలను నాటనున్నారు.

కార్యాచరణ సిద్ధం



వన మహోత్సవంలో భాగంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 11.50 లక్షల మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడతాం. డీఆర్‌డీఏ తరఫున ఈనెలాఖరులోగా గుంతలు తీయాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించాం. ప్రతి ఇంటికి 6 చొప్పున పూలు, పండ్లు, ఔషధ మొక్కలు అందజేస్తాం.

- ఉమాదేవి, డీఆర్‌డీవో

బాలలకు బంగారు భవిష్యత్తు

» బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

» అందుకోసం అధికారులు కృషి చేయాలి

» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా అధికారులు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్-11 నిర్వహణపై జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతీ అధికారి పక్కా ప్రణాళికను రూపొందించుకుని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలని కోరారు. బాల కార్మికులు కన్పిస్తే 1098కు వెంటనే సమాచారమందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల బాలికలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గత సంవత్సరం నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 30 మందిని, ముస్కాన్ కార్యక్రమంలో 24 మంది పిల్లలను పనుల నుంచి విముక్తి కల్పించి, యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, అదనపు ఎస్పీ రామేశ్వర్, సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, లేబర్ అధికారి చైల్డ్ ప్రొటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో అసంతృప్తి

» టీఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందని, సమ్మె అనివార్యమైతే ఇందుకు యజమాన్యం, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వీవీ కన్వెన్షల్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ఆదుకోవాలని, ఎన్నికల ముందు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చాన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీ బకాయిలతో పాటు సమస్యలు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని, అప్పుడు ఉద్యోగులు తమ వంతుగా ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నామని స్పష్టం చేశారు. డిమాండ్ల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలనే ఆలోచనతో అన్ని సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పాటు అవుతున్నాయని, త్వరలోనే సమావేశం కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ దిశగానే ప్రతీ జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులు సమ్మెకు వెళ్తే అందుకు బాధ్యత ప్రభుత్వం ఇటు యాజమాన్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగుల పని గంటలు పెంచడంతో మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి వెంటనే ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, డీఎస్ చారి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి



తిమ్మాజిపేట మద్యం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ యువకులు

తిమ్మాజిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం సరఫరా చేసే మద్యం డిపోలో హమాలీలుగా పని చేసేందుకు నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశం కల్పించాలని పలువురు యువకులు డిమాండ్ చేశారు. మంగళవారం డిపో ముందు 15మంది యువకులు ధర్నా నిర్వహించారు. నిరుద్యోగ యువకుల ఐక్యత వర్ధిల్లాలని, ఉపాధి అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. పలువురు యువకులు మాట్లాడుతూ లిక్కర్ బీరు అసోసియేషన్ వారి అనుమతులు పొందామన్నారు. 2008, 2009 సంవత్సరంలో మూడు నెలల పది రోజుల పాటు డిపో ముందు రిలే నిరాహార దీక్షలు చేసినట్లు తెలిపారు. అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడమే కాకుండా యువకులను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కాలయాపన జరుగుతోంది తప్ప తమకు న్యాయం జరగడం లేదని, ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం మద్యం డిపో మేనేజర్ శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త వెంకటేశ్, నాయకులు స్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్

» ఉత్సాహంగా జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఫుట్‌బాల్ క్రీడాకారులతో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణపురంలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ఎంపికలను మంగళవారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికలను ఎన్పీ వెంకటేశ్ ప్రారంభించి, మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్ టీఎస్ రంగారావు, ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి నగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇమ్మనుయ్యల్ జేమ్స్, వెంకట్‌రాములు, ఫుట్‌బాల్ కోచ్ నికేష్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ మూడో స్థానంలో మహబూబ్‌నగర్



రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయి టోర్నీలో జట్టు మూడో స్థానంలో నిల్వడంతో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్పీ వెంకటేశ్ అభినందించారు. ఫుట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

జెన్‌కోలో సాధారణ బదిలీలు చేపట్టాలి

» ఎస్ఎల్‌బీహెచ్ఈఎస్ బ్రాంచ్ సెక్రెటరీ మధన్‌మోహన్ రెడ్డి



జెన్‌కో నూతన డైరెక్టర్ బాలరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఇంజనీర్లు

దోమలపెంట జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జెన్‌కోలో ఐదేళ్లుగా బదిలీలు జరగడంలేదని, సాధారణ బదిలీలు చేపట్టాలని ఎస్ఎల్‌బీహెచ్ఈఎస్ బ్రాంచ్ సెక్రెటరీ మదన్‌మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఈగలపెంటలోని జెన్‌కో కార్యాలయంలో జెన్‌కో నూతన డైరెక్టర్ బాలరాజును ఈగలపెంట జెన్‌కో నూతన సీఈ కేవీవీ సత్యనారాయణను ఇంజనీర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకు పైగా తాము ఏజెన్సీ ప్రాంతం శ్రీశైలం భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్నామని తెలిపారు. తమకు జెన్‌కో సంస్థలో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఉద్యోగులకు సరైన వైద్యం, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ఆపద వస్తే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం అంతా అమ్రాబాద్ అభయారణ్య పరిధిలో ఉన్నందున రాత్రివేళ 9గంటలకు వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ల అసోసియేషన్ సెక్రెటరీ చరణ్, చంద్రశేఖర్, సందీప్, నాయకులు యేసయ్య, పాల్, రామయ్య, లక్ష్మయ్య, మద్దేష్, మల్లికార్జున, సరోజమ్మ, మేరీ, సీత ఉద్యోగులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు



ఉడుగులగడ్డ తండాలోని తీగజాతి కూరగాయల పంటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి మహేందర్

మిడ్జిల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రైతులు కూరగాయల సాగుపై మక్కువ పెంచుకొని అధిక లాభాలు పొందాలని హార్టికల్చర్ అధికారి మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని వేముల గ్రామ పంచాయతీ ఉడుగులతండాలో రైతులు సాగుచేస్తున్న తీగజాతి, కూరగాయల పంటలను పరిశీలించారు. కూరగాయల పంటలకు చీడపీడలను గమనించి సస్యసరక్షణ చర్యలు గురించి వివరించారు. ప్రభుత్వం తీగ జాతి కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు పందిర్ల ఏర్పాటుకు ఎకరానికి రూ.లక్ష వరకు రాయితీ కల్పిస్తోందన్నారు. దీంతో పాటు డ్రిప్పును కూడా రాయితీ ద్వారా అందజేస్తుందని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

మునిసిపాలిటీలో రోడ్లు మంజూరు చేయాలి

కోస్గి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో పలు రోడ్లు మంజూరు చేయాలని కోస్గి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ మాజీ కౌన్సిలర్ బాలరాజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిసిన బాలరాజు కోస్గి నుంచి పోతిరెడ్డిపల్లి వయా తుంకిమెట్ల రోడ్డు, పోతిరెడ్డిపల్లి నుంచి జిన్నారం, గుండ్లపల్లి నుంచి జిన్నారం రోడ్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఆరా

ధన్వాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'అంధకారంలో కస్తూర్బా విద్యాలయం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన వార్తా కథనంపై జిల్లా అధికారులు ఆరా తీశారు. సంబంధిత శాఖ జిల్లా అధికారులు మంగళవారం విద్యాలయం ప్రిన్సిపాల్ గంగమ్మతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. ప్రస్తుతం సోలార్ పనిచేయడం లేదని, చార్జింగ్ లైట్లు ఏర్పాటు చేశామని ఆమె వివరణ ఇచ్చారు. సీసీ కెమెరాల పనితీరుపై కూడా వారు వివరణ కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సొంత ఇంటి కల సాకారం

నారాయణపేట న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం అన్నారు. నారాయణపేట మునిసిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డులో హౌసింగ్ పీడీ శంకర్‌తో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు మార్కవుట్ ఇచ్చి నిర్మాణాలను ప్రారంభించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మైనొద్దీన్, తఖీ, షాహీన్‌బేగం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులపై ఫిర్యాదు

ధన్వాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ పెద్ద చెరువు నుంచి అనుమతి లేకుండా ఒండ్రుమట్టి తరలింపుపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొడిగేలి శ్రీనివాసులు మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. ఒండ్రుమట్టి తరలింపు అనుమతులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కోట్లాది రూపాయల ప్రజా సంపదనను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

కోస్గి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడేందుకు ప్రతీ ఒక్కరు ఒక్కో మొక్క నాటాలని సర్జఖాన్‌పేట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కృష్ణగౌడ్ అన్నారు. మంగళవారం ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సకాలంలో వర్షాలు కురవాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నర్సిములు, సాయప్ప, లలిత ఉన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

మక్తల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్‌క్లబ్ సేవా భవనంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైందని విజన్ చైర్మన్ అనుగొండ శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షుడు డీవీ.చారి తెలిపారు. మంగళవారం క్లబ్ భవనం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో దృష్టి లోపం ఉన్న 30 మందిని గుర్తించి ఆపరేషన్ నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో సత్య అంజనేయులు, అంజన్‌ప్రసాద్, స్వాగత్ సత్యం, సభ్యుడు మామిళ్ల పృథ్విరాజ్ ఉన్నారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

నారాయణపేట న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో సద్గురు అవధూత నరసింహ స్వామి మఠంలో ఈనెల 10వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఘనంగా గురుపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నామని మఠం సభ్యులు తెలిపారు. మంగళవారం మఠంలో గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

దామరగిద్ద, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోకుర్తి నుంచి ఉల్లిగుండం గేట్ వరకు బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.రాములు అన్నారు. మంగళవారం అన్నాసాగర్, మొగుల్‌మడ్క, ఉల్లిగుండం గ్రామస్థులతో కలిసి ఆయన ఎంపీడీవో సాయిలక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం మాట్లాడుతూ లోకుర్తి నుంచి సర్సాపూర్ అన్నాసాగర్, ఉల్లిగుండం గేటు వరకు దాదాపు 10 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతలమయంగా మారిందని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా నాయకులు గోపాల్, శివకుమార్, మొగులప్ప, మొగుల్‌మడ్క, ముస్తాపేట మాజీ సర్పంచ్‌లు మహిపాల్, లాలప్ప తదితరులున్నారు.

రుణమాఫీ చేయాలని వినతి

దామరగిద్ద, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం మండల నాయకుడు జోషి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల రైతులతో కలిసి ఆయన ఏవో మణిచందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ రూ.2 లక్షలకు పైగా ఉన్నవారికి కూడా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి మిగిలినవి కట్టమని చెపితే రైతులు కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, మాణిక్యప్పగౌడ్, బోయిని రాములు, వీరన్న, హనుమంతు తదితరులున్నారు.

బీసీ రాయ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్
- ఘనంగా డాక్టర్స్ డే


మెడికల్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్

నారాయణపేట టౌన్/నారాయణపేట/మక్తల్/దామరగిద్ద, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీసీ రాయ్ జన్మదినం సందర్భంగా నారాయణపేట మెడికల్ కళాశాలలో మంగళవారం ఘనంగా డాక్టర్స్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, డాక్టర్లు, విద్యార్థులు కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్లు, కాబోయే డాక్టర్లు భారత రత్న బీసీ రాయ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రజలందరికి వైద్య సేవలు అందించాలని కోరారు. అందరి కృషి ఫలితంగా రెండవ సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సు అడ్మిషన్ కోసం జాతీయ మెడికల్ కమిషన్ నారాయణపేట మెడికల్ కళాశాలకు అనుమతి వచ్చిందని తెలిపారు. ఎన్ఎంసీ అనుమతికి సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు, సిబ్బందికి రాంకిషన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుందరి దేవి, ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరావు, డాక్టర్లు అమితాకుమారి, అరుణకుమారి, సునీల్‌కుమార్, ఏ.రాయిస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిత్య, ఆర్ఎంవో డాక్టర్ రాఘవేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, ట్యూటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా, పేటలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అభిమాన సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ప్రముఖ స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ గీత విశ్వనాథ్, జనరల్ ఫిజిషియన్ గందె కార్తీక్ కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు సునీది గందెలను పూలమాల, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి మిఠాయిలను పంపిణీ చేశారు. మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్, లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ నారాయణ్‌భట్టడ్, బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వసంత్‌కుమార్, సంగ నర్సింహులు, రామకృష్ణ కళ్యాణి, సువర్ణ ఉన్నారు.

మక్తల్ పట్టణంలోని సివిల్ ఆసుపత్రిలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గోపాలం, ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు వినిత, కౌశిక్‌రెడ్డి, జుబేరా బేగం, సిద్దులను మెమెంటో, శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ నిత్యం ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం కాపాడుతున్న డాక్టర్ల సేవలు మరువలేనివన్నారు. సంఘం సభ్యులు సూర్యప్రకాష్, మల్లికార్జున్, కిష్టయ్యగౌడ్, మౌలానా, సిద్దిలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద పీహెచ్‌సీలో వైద్యులు ఐశ్వర్య, హరిచందన, భరత్‌సింహారెడ్డి, సోహెల్, స్రవంతిలను ఆసుపత్రి సూపర్‌వైజర్లు ఘనంగా సన్మానించారు. నర్సింగ్ ఆఫీసర్ శివలీల, శ్రీనివాస్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- బాల సదనం తనిఖీ


చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అందరు బాగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో ఉన్న బాలసదనాన్ని మంగళవారం సాయంత్రం కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. సదనంలో మొత్తం ఎంత మంది చిన్నారులు ఉన్నారని అక్కడి సిబ్బందిని ఆమె అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల స్టడీ అవర్‌ను పర్యవేక్షించారు. ఎవరెవరు ఏఏ తరగతిలో చదువుతున్నారని చిన్నారులను అడిగి, వారి బోధన పటిమను పరిశీలించారు. ఓ చిన్నారి వేసిన యోగాసనాలను చూసి కలెక్టర్ అభినందించారు. అలాగే సదనంలోని వంట గదిని పరిశీలించిన కలెక్టర్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. సదనంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు.

శిథిలావస్థ ఇళ్లను ఖాళీ చేయాలి


మద్దూర్‌లోని పీదిగేరిలో మునిసిపల్ సిబ్బంది గుర్తించిన ఇల్లు

మద్దూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయాలని మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. వర్షాకాలం దృష్ట్యా కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలోని వారు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా ముందుగానే అలాంటి ఇళ్లను ఖాళీ చేయాలని కమిషనర్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని వివిధ వాడల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను మునిసిపల్ సిబ్బంది గుర్తించే పనిలో పడ్డారు. గుర్తించిన ఇళ్లపై హెచ్చరిక రాసి ఖాళీకి ఆదేశాలు ఇచ్చారు.

విద్యుత్ కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలి


సిబ్బందికి భద్రతా పరికరాలను అందజేస్తున్న ఎస్ఈ వెంకటరమణ

నారాయణపేటటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎస్ఈ వెంకటరమణ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ లైన్ పనులు చేసే కార్మికులు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు, చేతి తొడుగులు ధరించి పని చేయాలన్నారు. ఎల్‌సీ తీసుకునే సమయంలో ఒకటికి రెండుసార్లు ఖచ్చితమైన సమాచారంతో ఎర్త్‌రాడ్ తగిలించుకొని తరువాత పని చేయాలని ఎంఎస్‌పీ డీఈ శ్రీనివాస్ తెలిపారు. కార్మికులు పని చేస్తూ సెల్‌ఫోన్‌లో మాటాడొద్దని ఏఈ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. అనంతరం ఎస్ఈ వెంకటరమణ కార్మికులకు భద్రత పరికరాలు పంపిణీ చేశారు. ఏఈ రఫీ, అనిల్‌కుమార్, ఫోర్‌మెన్ మల్లికార్జున్, యాసిన్, సబ్ డివిజన్ కార్మికులు పాల్గొన్నారు.

పేదల మార్పు కోసం ఎర్రజెండా పోరాటం

ధన్వాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదల మార్పు కోసం ఎర్రజెండా ఎప్పుడూ పోరాటం చేస్తూనే ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ ఆరవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంతోష్‌తో పాటు వెంకటేష్, రాములు మాట్లాడుతూ రాజ్యాంగ మూల సూత్రాలకు విరుద్ధంగా పాలనా వ్యవస్థ కొనసాగుతోందన్నారు. కేంద్రంలో బీజేపీ అన్ని రంగాల్లో విఫలం అయ్యిందన్నారు. పేదలను మోసం చేసే ప్రభుత్వాలు ఎక్కువ రోజులు ఉండవన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రోజురోజుకు నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ


ధన్వాడలో బోనాలతో మహిళలు

మరికల్/ధన్వాడ/మాగనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మరికల్, ధన్వాడ, మాగనూరు మండల కేంద్రాల్లో మంగళవారం బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. మరికల్‌లో మహిళలు బోనం కుండను తలపై పెట్టుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, మేళతాళాల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా కట్ట మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ఒడి బియ్యం పోసి, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాములు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి, వీరబసంతు, కానుగంటి నారాయణ, రామకృష్ణా రెడ్డి, హెచ్.శ్రీనివాసులు, దండు రాములు, ఎల్.రాములు, రాఘవేందర్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

అదేవిధంగా, ధన్వాడలో కుర్వ యాదవులు బోనాల పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బీరప్ప ఆలయం నుంచి అంబలి బోనంతో ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతురాజు విన్యాసాలు, మహిళల పూనకాలతో ఊరేగింపుగా వెళ్లి పోలమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించారు.

మాగనూరులో మహంకాళి మైసమ్మ అవ్వ బోనాల పండుగను జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు తదితరులున్నారు.


మరికల్‌లో పెద్ద బోనంకుండతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

● ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఈ నెలరోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఈ నెలరోజుల పాటు పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాళ్లలో ఎలాంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమికూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయొద్దని సూచించారు. అనుమతులు లేకుండా పైకార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అలాగే సోషల్ మీడియాలో అవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని కోరారు.

నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ తదితర ప్రాజెక్టుల నుంచి దిగువ ఉన్న కృష్ణా, భీమా నదులకు వరదలు రావడంతో నిండుకుండలా మారింది. మంగళవారం తహసీల్దార్ నదీ పరివాహక గ్రామాలైన సుకూరులింగంపల్లి, తంగడిగి, గుడేబల్లూరు, హిందూపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతీనగర్, వాసునగర్‌లను సందర్శించి, మాట్లాడారు. మోటార్ల మరమ్మతుల కోసం రైతులు నదిలోకి వెళ్లకుండా ఉండాలని, పశువుల కాపరులు నదిలో దిగకుండా ఉండాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, పోలీస్ హెచ్‌సీ చంద్రశేఖర్, రైతులు ఉన్నారు.

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

ఊట్కూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఒక్కో రైతుకు నాలుగు కిలోల చొప్పున కాంగ్రెస్ నాయకులు కంది విత్తనాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యజ్ఞదత్ తదితరులున్నారు.

ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన

ఊట్కూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకాలపై మంగళవారం తహసీల్‌లో ఎస్‌బీఐ బీఎం, కౌన్సిలర్ చాంద్‌సుల్తానా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ పీఎంజేజేబీవై, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి, జన్‌ధన్ ఖాతాల గురించి ఆమె వివరించారు. తహసీల్దార్ రవి, ఎంపీడీవో ధనుంజయగౌడ్ తదితరులున్నారు.

రాంచందర్‌రావు ఎంపికపై హర్షం

నారాయణపేట న్యూటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ఎన్నుకోవడంపై కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాంచందర్‌రావుకు అందరినీ కలుపుకపోతారని, ఆలోచించే అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు.

జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి


తెలుగు సబ్జెక్టులో మొదటి స్థానం కైవసం చేసుకున్న విద్యార్థినులను సన్మానించిన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, సంస్థ నిర్వాహకులు

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేటటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో విలేజెస్ ఇన్ పాట్నర్‌షిప్(వీఐపీ) సంస్థ ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమంలో 'పది'లో మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 'పది'లో మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు తోటి విద్యార్థినులకు దిక్సూచి కావాలని సూచించారు. బాలికా విద్యను ప్రోత్సహించే విధంగా సంస్థ కృషి చేయడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసలతో ముంచెత్తారు. డీఈవో గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థినులకు రూ.5 వేల నగదు, ప్రశంసాపత్రం, బ్యాడ్జ్‌తో పాటు తల్లిదండ్రులకు వస్త్రాలను అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం ఆయన పాఠశాలకు నల్ల నేరేడు మొక్క, గ్రామ పంచాయతీకి ఉసిరికాయ మొక్క, విద్యార్థికి బిల్వపత్రం మొక్కను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మోహన్‌రెడ్డి, అరవింద్‌స్వామి, హెచ్ఎంలు, సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను ఉపయోగించుకోవాలి

- ఎంఈవో కృష్ణారెడ్డి


విద్యార్థికి చికిత్స అందిస్తున్న డాక్టర్ ప్రీతిగౌడ్

దామరగిద్ద, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఫిజియోథెరపీ సేవలను ఉపయోగించుకోవాలని ఎంఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎస్‌లో ప్రతీ మంగళవారం, గురువారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపిస్టు డాక్టర్ బి.ప్రీతిగౌడ్ ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఆటిజం, మానసిక వైకల్యం, మరుగుజ్జు, చెవుడు తదితర సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్స చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ హెచ్ఎం చందు, ఉర్దూ మీడియం హెచ్ఎం లతీఫ్, ఐఈఆర్పీ భాగ్యమ్మ, స్పెషల్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి తదితరులున్నారు.

రైతులకు ఘన సన్మానం


రైతులను సన్మానిస్తున్న గణేష్‌కుమార్

మక్తల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మక్తల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు ఎల్లవేళలా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు మ్యాదరి శ్రీనివాసులు, నాగరాజు, రంజిత్‌రెడ్డి, శాలం, ఫయాజ్, రైతులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ సతీష్‌కుమార్

మక్తల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ సతీష్‌కుమార్ అన్నారు. జూన్ 30 అంతర్జాతీయ, జాతీయ ఖోఖో దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నేతి కృష్ణమూర్తి ఆదేశాల మేరకు మక్తల్ మినీ స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ఖోఖో ప్రథమస్థానం కర్ని జడ్పీహెచ్ఎస్, ద్వితీయ స్థానం కున్సి జడ్పీహెచ్ఎస్, తృతీయ స్థానం ఊట్కూర్ బాలికల గురుకుల విద్యార్థినులు దక్కించుకున్నారు. ఖోఖో అడ్వయిజర్ గోపాలం, పీడీ విష్ణువర్ధన్ రెడ్డి, పీఈటీలు అంబ్రేష్, రమేష్‌కుమార్, రూప, సౌమ్య, నీలి రాఘవేందర్, మంజుల, క్రీడాకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పుర కమిషనర్ శంకర్‌నాయక్

మక్తల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో కార్మికులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 30వ రోజు మక్తల్ పురపాలికలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కమిషనర్ శంకర్‌నాయక్ సబ్బులు, నూనె, యూనిఫామ్, రెయిన్‌కోట్, కిట్స్ అందించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. మేనేజర్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మక్తల్/నారాయణపేట న్యూటౌన్/మాగనూరు/దామరగిద్ద, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోవిందరాజు, ఆశ వర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు గోవిందమ్మ అన్నారు. మంగళవారం మక్తల్ మండలం కర్ని పీహెచ్‌సీలో డాక్టర్ తిరుపతికి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు యశోద, అమీనాబేగం, అనిత, స్వప్న, ఇందిర, రాధిక, ఆశాబీ, తిరుపతమ్మ, వెంకటమ్మ, రాధమ్మ, లక్ష్మీ, సుజాత పాల్గొన్నారు.

అదేవిధంగా, నారాయణపేట పట్టణంలోని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నర్సింగ్‌రావుకు, ఆశా నోడల్ అధికారి సబితరాణికి, ప్రైమరి హెల్త్ సెంటర్ల ఆశా కార్యకర్తలతో కలిసి సీఐటీయూ నాయకులు సమ్మె నోటీస్‌లు అందించారు. కోటకొండ పీహెచ్‌సీలో వైద్యురాలు చందనకు ఆశా యూనియన్ నాయకురాలు రాధిక సమ్మె నోటీస్ అందజేశారు. ఆశా యూనియన్ నాయకులు హైమావతి, రమ, అంజమ్మ, బాలనర్సమ్మ, కల్పన, మహేశ్వరి, విజయలక్ష్మి, లక్ష్మి, అనురాధ తదితరులున్నారు.

మాగనూరులో ఎంపీడీవో శ్రీనివాసులు, పీహెచ్‌సీ డాక్టర్ అఫ్రోజ్‌కు సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు శాంతమ్మ, పార్వతమ్మ, అనురాధ, అంజమ్మ, పద్మ, కృష్ణవేణి, శోభ, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, నాగేష్‌బాబు, కె.నర్సింహ్మ, మహదేవ్ తదితరులున్నారు.

దామరగిద్దలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆశా కార్యకర్తలతో కలిసి వైద్యాధికారి డాక్టర్ సుదేష్ణకు సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బల్‌రాం, మండల నాయకులు మహేష్ ఈరమని, అరుణ, చెన్నమ్మ, విజయలక్ష్మి, సుజాత, రాధిక సుమలత పాల్గొన్నారు.